# తాజ్ మహల్

శుభజ్యోత్స్న

**సంధ్యా సమయం**...అలసి సొలసిన సూర్య భగవానుడు పశ్చిమాద్రిని సమీపించి సువర్ణ కాంతులతో ప్రకాశిస్తూ భూతలాన్ని స్వర్ణమయం చేస్తున్నాడు. యమునా తీరాన తాజమహల్ పైన ప్రసరించిన నీరెండ అక్కడి వాతావరణాన్ని స్వర్గతుల్యం చేసేస్తోంది.

తాజమహల్ కెదురుగా అల్లంత దూరాన ఒక చలువరాతి వేదికపై కూర్చుని, ఎంతో సేపటినుంచీ ఆ తాజమహల్ అందాల్ని అలా అలా అవలోకిస్తూ ఉన్నాడు షాజహాన్ పాదుషా. గత స్మృతుల నీలి నీడలు ఆయన కళ్ళ ముందు దోబూచులాడుతూ ఆయన హృదయ భారాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. భరించరాని దుఃఖం ఉండి ఉండీ ఆయన కన్నుల నుండి బాష్పబిందువుల రూపంలో జాలువారుతూ ఆయన జీబురు గడ్డాన్ని తడిపి వేస్తోంది. ఆయన కన్నీరు అనంతమైనది. ఆయన దుఃఖం చల్లారనిది. ఆ కన్నీరు తుడవ గలిగిన వ్యక్తి ఆయన హృదయాధిదేవత ముంతాజమహల్ మాత్రమే. కాని, ఆమె ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన షాజహాన్‌ని, ఈ ప్రపంచాన్నీ వదిలి నిర్దయగా వెళ్ళి పోయింది. వెళుతూ వెళుతూ షాజహాన నుండి రెండు వరాలు స్వీకరించి వెళ్ళిపోయింది. ఆ వరాల ఫలితమే ఈ నాడు మనం నేత్ర పర్వంగా ఆలకిస్తున్న తాజమహల్.

అప్పుడప్పుడే చీకట్లు ఆవరించుకుంటున్నాయి. షాజహాన్ అక్కడ నుండి కదిలాడు. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తాజమహల్ వేపు నడిచాడు. చంద్రశిలా నిర్మితమైన సోపానాలనధిరోహించి ముఖద్వారం సమీపించాడు.

అంతే. ఆయన కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి. గత స్మృతులతో బాహ్య ప్రపంచాన్ని విస్మరించిన పాదుషా ఉలిక్కిపడి ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చాడు. ఆయన చెవులకు స్పష్టంగా ఏవో మాటలు వినబడుతున్నాయి. ఎవరో వ్యక్తి తాజమహల్ లోపల తనలో తాను మాట్లాడుకుంటున్నాడు.

“ఆహా! ఏమి ఈ భవన సౌందర్యం! పరమ మనోహరమైన సర్వ జన సమ్మోహనమై, సకల లోక యశోవిశాలమై చూపరుల కన్నులు మిరుమిట్లు గొలుపు కాంతిపుంజములతో ఎంత చూచినా తనివితీరని పరమాద్భుత శిల్ప వైభవముతో—ఆహా! నన్నే దిగ్భ్రాంతి గొలుపుచున్నదే!”

ఆ వ్యక్తి మాటలకు షాజహాన్ మనసు అనిర్వచనీయమైన ఆనందంతో, విజయగర్వంతో ఉద్విగ్నమైంది. ఆ వ్యక్తి ఎవరో, తాను వెళ్ళి అతని కంట పడితే ఆ వ్యక్తి మాటలకు అంతరాయం కలుగుతుందేమో అనుకుని అత డింకా ఏం చెబుతాడో విందామని కుతూహలంతో చాటుగా నిలబడి చెవులు రిక్కించి వినసాగాడు. రెండు మూడు క్షణాలు ఆగిన తరవాత లోపలి వ్యక్తి కంఠం మళ్ళీ వినిపించ సాగింది.

“ఈ అద్భుత సౌధరాజమును నిర్మించినది నేనేనా? నాలో ఇంత శక్తి దాగి ఉన్నదా? ఇంతటి రమణీయ కళాఖండమును నిర్మించు శక్తి నా కెటుల గల్గినది? అంతా నీ మహిమే, హలీమా! ఇదంతా నీ ఆరాధనా ఫలితమే. అవును, హలీమా! ఈ నాటికి నా చిరకాల వాంఛ నెరవేరినది. హలీమా! నా ప్రియతమా! ఒకనాటి మన ప్రణయానికి స్మృతి చిహ్నమే ఈ మహల్. ఇది హలీమా మహల్. ఇది నీకు ప్రేమ నైవేద్యంగా నేను సమర్పించుకుంటున్న నీ విశ్రాంతి మందిరం.”

ఆ మాటలకు అదిరి పడ్డాడు షాజహాన్. ‘ఏమిటీ వైపరీత్యం? ఎవడు వాడు? హలీమా ఏమిటి? ఏమిటిదంతా?’ అతని తల తిరిగి పోయింది. గుండె వేగంగా కొట్టుకో సాగింది. తన కెవ్వరితోనూ నిమిత్తం లేనట్టు లోపలి వ్యక్తి మాట్లాడుతూనే ఉన్నాడు.

“కాని, వెర్రివాడు నా తమ్ముడు షాజహాన్ పాదుషా ఇది తాజమహల్ అని భ్రమ పడుతున్నాడు. ఇది ముంతాజమహల్ అని మురిసి పోతున్నాడు. కాని అంతకంటే ముందు నీ పవిత్ర శరీరం ఇక్కడ ఖననం చేయబడిందనీ, ఇది హలీమామహల్ అనీ ఆ పిచ్చివాడికి తెలియదు. చరిత్రలో ఇది తాజమహల్‌గా ప్రఖ్యాతి వహించుగాక — ఇది హలీమామహలే. లోకానికి సత్యం తెలియక పోయినా ముమ్మాటికీ ఇది హలీమా మహలే.”

షాజహాన్ తలపై బలంగా ఎవరో క్రరతో బాదినట్లయింది. ఆయన గుండె హఠాత్తుగా ఆగినట్లయింది. ఆ వ్యక్తి మాటలు—‘వెర్రి వాడు నా తమ్ముడు...షాజహాన్...’ అతని చెవుల్లో గింగురు మన్నాయి. ‘ఎవ రాతడు? నా తమ్ముడు షాజహాన్ అంటాడేమిటి? తన సోదరులు ఇంకా ఎవరున్నారు బతికి?’ అతని పళ్ళు పటపట లాడాయి. కళ్ళు అగ్నిగోళాల్లా మండిపోయాయి. ఓటమి అంటే ఏమిటో ఎరగని ఆయనకు ఘోర పరాజయం సంభవించినట్లు హృదయం కుత కుత లాడిపోయింది. కరవాలం దూసి వ్యక్తి కంఠాన్ని ఒక్క వేటుతో ఉత్తరించడానికి శరవేగంతో లోనికి వెళ్ళాడు.

సవ్వడి విని ఆ వ్యక్తి ఇటు తిరిగాడు. షాజహాన్ భీకరాకాన్ని చూసికూడా ఏ మాత్రం చలించలేదాతను. పైగా అతని పెదవులపై చిరునవ్వు మెరిసింది. అతణ్ణి చూసి షాజహాన్ నిర్ఘాంత పోయాడు. అత డెవరో కాదు. తాజమహల్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రధాన శిల్పి.

“సలామాలేకుం జహాపనా!” అంటూ చిరునవ్వుతో అభివాదం చేశాడు ప్రధాన శిల్పి.

పుండుమీద కారం రాచినట్టు మరింత మండి పడ్డాడు షాజహాన్. తనను చూసికూడా ఏ మాత్రం చలించక నిర్భయంగా నిలుచుని చిరునవ్వుతో తనకు అభివాదం చేస్తున్న ఆ వృద్ధ శిల్పిని చూసి ఒళ్ళు మండ పోయింది పాదుషాకు. పళ్ళు నూరుతూ, కళ్ళు ఉరిమి చూస్తూ, గర్జించాడు. “ద్రోహీ! ఎవరు నువ్వు?”

ఆ వ్యక్తి “హ్హా” అంటూ ఛీత్కారం చేశాడు. తిరస్కారంగా షాజహాన్ ముఖంలోకి చూస్తూ “నేనా ద్రోహిని షాజహాన్! ఎవడురా ద్రోహి? పితృద్రోహివి నువ్వు. భ్రాతృ హంతకుడివి నువ్వు. నన్ను ద్రోహి అంటున్నావా, షాజహాన్?”

ఆవేశంతో తనను తాను మరిచిపోయాడు షాజహాన్ ‘ఇన్నాళ్ళుగా తన ఉప్పూ కారమూ తిని, తన దయా భిక్షపై బతుకుతూన్న ఈ కూలివాడు తనంతటి వాడిని పేరు పెట్టి పిలవడమా? అరే, ఒరే అనడమా? ఎన్ని గుండెలు వీడికి?’ కరవాలం ఝళిపిస్తూ హుంకరించి ముందుకు దుమికి “నిజం చెప్పు. ఎవరు నువ్వు?” అంటూ ఖడ్గం పైకెత్తాడు.

ఆ వ్యక్తి నిర్లిప్తంగా అదే చిరునవ్వు రువ్వుతూ, అర్ధనిమీలిత నేత్రాలతో నిర్లక్ష్యంగా చూస్తూ, గుబురుగా పెరిగిన గడ్డాన్ని దువ్వుకుంటూ నింపాదిగా అన్నాడు: “నన్నే ఎవరని అడుగుతున్నావా, షాజహాన్! నన్నింకా నీవు గుర్తించ లేదా? నేనురా ఖుస్రూని.”

“ఖుస్రూ? ఖుస్రూ?” అస్పష్టంగా గొణుగుతూ, అయోమయంగా వెర్రి చూపులు చూడసాగాడు షాజహాన్.

“అవును. ఖుస్రూనే. ఖుస్రూ అంటే ఎవరో గుర్తు రావడం లేదా? నువ్వు అక్రమంగా అధిష్ఠించిన భారత సింహాసనాన్ని సకల రాజలాంఛనాలతో, వారసత్వాధికారంతో పొందవలసిన నీ అన్న ఖుస్రూని!”

దిమ్మెర పోయాడు షాజహాన్. ఆయన శరీరంలోని ప్రతి అణువూ స్తంభించి పోయినట్టు కొయ్యబారి పోయాడు. ఆయనకు నమ్మశక్యం కాకుండా పోయింది. “ఇది ఎలా సంభవం? నువ్వు నా అన్న ఖుస్రూవా? నిజమా? ఇది నిజమా?” తనలో తాను అనుకుంటున్నట్టు పైకి అన్నాడు షాజహాన్.

ఖుస్రూ ఒక్కసారి వెకిలిగా నవ్వి “నమ్మలేకున్నావా, షాజహాన్! ఇంకా సందేహిస్తున్నావా? హు! రాజ్య కాంక్షతో, పదవీ వ్యామోహంతో నువ్వు చేసిన ఘాతుక చర్యలను అప్పుడే మరిచి పోయావా, షాజహాన్?” అన్నాడు జుగుప్సగా చూస్తూ.

నిర్విణ్ణుడై చూస్తూ ఉండి పోయాడు షాజహాన్.

ఖుస్రూ అన్నాడు మళ్ళీ: “మన తండ్రి జహంగీరు పాదుషా తరవాత ఆయన జ్యేష్ఠ పుత్రుడినైన నేను, నీ అన్న ఖుస్రూని భారత సామ్రాట్టును కావలసి ఉండగా చరిత్రనే మార్చి వేశావు కదురా దుర్మార్గుడా! కన్నతండ్రిని కారాగార బద్ధుణ్ణి చేసి., సోదరుల



నందరినీ వధించి రాజ్యాధికారం హస్తగతం చేసుకున్నావు. షాజహాన్ బిరుదు ధరించి భారత సామ్రాట్టువై కులుకుతున్నావు కాదా? ఎలా మరువగలవురా ఇదంతా?''

షాజహాన్ అనుమానం పొర విడిపోసాగింది. ఆ శిల్పి తన అన్న ఖుస్రూయే అని నమ్మవలసి వస్తోంది అతని మాటలు వింటూ ఉంటే. కాని తన చేతులారా చంపి వేసిన ఖుస్రూ మళ్ళీ ఎలా బతికి బయట పడ్డాడు? ఇది అతనికి చిక్కు విడని ప్రశ్నగా మిగిలి పోయింది. అదే ప్రశ్నించాడు: ''ఖుస్రూ! నిజంగా నువ్వు నా అన్నవేనా? నిజం చెప్పు. ఆ నాడు నువ్వు మరణించలేదా?''

ఖుస్రూ ముఖం గంభీరంగా మారిపోయింది. చూస్తూండగానే అతని కళ్ళు జల పూరితాలయ్యాయి. లోకాన్ని చూడటానికి మనస్కరించని వాడిలా కళ్ళు రెండూ గట్టిగా మూసుకున్నాడు. రెండు కన్నీటి చుక్కలు చెంపల మీదుగా జారి అతని గుబురు గడ్డాన్ని తడిపాయి. గద్గద స్వరంతో అన్నాడు ఖుస్రూ:

''షాజహాన్! జీవితం చరమ దశకు చేరుకుంటున్న ఈ వయసులో మన కింకా రాగద్వేషా లెందుకు? ఎన్నో ఏళ్ళ తరవాత ఒక తల్లి కడుపున పుట్టిన మనం ఈ నాడు ఇలా కలుసుకున్నాం. కొంతసేపు 'భారత సామ్రాజ్యాధి నేతను' అన్న భావం విడిచి పెట్టి, ఒక రక్తం పంచుకుని పుట్టిన సోదరుడివిగా నేను చెప్పేది విను.

ఆ నాడు రాజ్యకాంక్షతో ఎన్నో కుట్రలు చేసి, సోదరుల నందరినీ చంపి వేసి నీ మార్గం నిష్కంటకం చేసుకున్నా ననుకున్నావు కదూ! కాని, లేదురా! నేను మాత్రం మరణించలేదురా! నా ప్రణయదేవి హలీమా నన్ను రక్షించిందిరా! నా ప్రాణానికి తన ప్రాణం అడ్డు వేసిందిరా!''

'హలీమా!' ఆ పేరు ఎక్కడో విన్నట్టు లీలగా గుర్తు వచ్చింది షాజహాన్‌కు. కొన్ని క్షణాలు ఆలోచనలో పడ్డాక అతనికి స్ఫురించింది. ''ఆ హలీమా... దాసీ పుత్రి...'' అని అస్పష్టంగా గొణిగాడు.

"ఒరేయ్, షాజహాన్!" పళ్ళు పటపట కొరికాడు ఖుస్రూ. అతని కళ్ళ నుండి నిప్పురవ్వలు రాలాయి. "దాసీపుత్రి...దాసీపుత్రి! ఇంకా హలీమాను దాసీ పుత్రిగానే భావిస్తున్నావా? ఆమె విలువను గుర్తించలేకున్నావా? షాజహాన్! హలీమా అంటే ఏమిటనుకున్నావు! నీ ముంతాజులు వెయ్యి మంది అయినా ఆమె కాలిగోటికికూడా సరిపోలరు, తెలిసిందా! ఆ పవిత్రమూర్తి—హలీమా నా ప్రణయదేవి...ఇదుగో ఇటు చూడరా! ఇక్కడే విశ్రాంతి తీసుకుటూంది. ఇది నీ ముంతాజు సమాధి అనుకుంటున్నావా, షాజహాన్? కాదురా! ఇది నా హలీమా సమాధి. ముంతాజు కంటె ముందుగా నా హలీమా పవిత్ర శరీరం నిక్షిప్తం చేయబడిన అతి పవిత్ర స్థలంరా ఇది!ఇదిగో ఇక్కడే ఇక్కడే నాహలీమాను భూస్థాపితం చేశాను." అంటూ అక్కడే చతికిల పడి నేలను తడుముతూ "హలీమా! హలీమా!" అంటూ తల బాదుకున్నాడు. ఎన్నో ఏళ్ళుగా అతని హృదయంలో కరడు గట్టుకుని ఉన్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికి వచ్చింది. ఎంతో కాలంగా అతని హృదంతరాళంలో దాగి ఉన్న చరిత్ర కందని సత్యం అతని కంఠం నుండివెలువడి షాజహాన్ కర్ణపుటాల్ని బేదించ సాగింది. నిర్విణ్ణుడై ఖుస్రూనే చూస్తూ, అతని మాటల్ని వింటూ నిలుచుండి పోయాడు షాజహాన్.

ఖుస్రూ దుఃఖాన్ని ఆపుకుని నేలమీద వాలి కనిపించని అతని ప్రియురాలు హలీమాతో చెప్ప సాగాడు. "హలీమా! పవిత్రప్రేమకు కులమూ, మతమూ, వర్ణమూ, వర్గమూ — ఇవేవీ అడ్డు రావని తెలియని మూఢులు మన సాంగత్యాన్ని గర్హించారు. నువ్వు దాసీ పుత్రివట! భావిభారత సామ్రాట్టునైన నేను నిన్ను వరించకూడదట! హుఁ! ఎక్కడిదీ శాసనం? బురదలో తామరపువ్వు పుట్టలేదా? మట్టిలో మాణిక్యం వెలయలేదా? అంత మాత్రాన వాటి గరిమ తరిగిందా? దాసీ వంశంలో జన్మించినంతమాత్రాన నీకు వచ్చిన లోటేమిటి? నీ విలువను గుర్తించలేని సమాజం నీవు నా ధర్మపత్నివి కావడానికి అనర్హురాలివని శాసించింది. భారత సింహాసనం పొందే వారసత్వాధికారం నా కుండబోదని అధిక్షేపించింది. హుఁ! ఎవడికి కావాలి ఆ రాజ్యాధికారం? నీవు లేని నాకు రాజవైభవా లెందుకు? నీ ముందు నా కా రాజభోగాలు తృణప్రాయాలు. ఆ నవరత్న ఖచిత సింహాసనం నాకు గుడ్డి గవ్వతో సమానం. అందుకే, హలీమా, నా తండ్రి జహంగీరు పాదుషా తరవాత రాజ్యానికి వారసుడివి నేనే అయినా, ఆ భోగ భాగ్యాలను, ఆ ఉత్కృష్ట సింహాసనాన్ని తృణీకరించాను. అయినా నాకు వచ్చిన లోటేమిటి? నీ ప్రణయ సామ్రాజ్యానికి ఏకచ్ఛత్రాధిపతిని నేను. నీ సాంగత్యంలో అమర లోకాలలో విహరించాను. నీ అధర రసాస్వాదనలో అమృత మాధురులు చవిచూచాను. నీ కౌగిలింతలో కోటి కోటి పులకింతలను కొల్లగొట్టాను. నా కంటే అదృష్టవంతుడు, ఐశ్వర్యవంతుడు ఈ ప్రపంచంలో నేను గాక వేరెవ్వరున్నారు? ఇంతకంటే గొప్పదా ఆ సింహాసనం? ఇంతకంటే సుఖప్రదములా ఆ రాజవైభవాలు? కాదు. నీవు తప్ప మిగిలిన ఐశ్వర్యాలు రస విహీనాలు. అందుకే అందరినీ ఎదిరించి, అన్నిటినీ త్యజించి నిన్నే కోరుకున్నాను. నిన్నే వలచాను. నిన్నే వరించాను. కాని...కాని...ఈ దుర్మార్గుడు...నా తమ్ముడు షాజహాన్ సాగించిన మారణకాండలో నువ్వు బలి అయ్యావు. నిరపరాధిని అయిన నువ్వు ఆహుతి అయ్యావు. ఆ ఫిరంగి గుండుకు నువ్వు అడ్డు పడకుండా ఉండి ఉంటే ఆ గుండు నా గుండెలో దూసుకుని ఆనాడే నేను మరణించి ఉండేవాడిని. ఆ నాటితో మన ప్రేమ కథ ముగిసిపోయి ఉండేది. యమునా తీరాన చిత్రాతిచిత్రమైన ఈ తాజమహల్— కాదు, కాదు— హలీమామహల్— వెలిసేది కాదు. మన ప్రేమకు శాశ్వత రూపకల్పన జరిగేదే కాదు. నా కోసం నీ ప్రాణాలు ధారపోసి పవిత్ర ప్రేమ త్యాగాన్ని కోరుతుందనే సత్యాన్ని నిరూపించావు. నీవు దాసీ పుత్రివైతే మాత్రమేం, హలీమా! ఆ ఫిరంగి గుండు సూటిగా నీ గుండెలో— అబ్బా... భరించలేను. ఆ భయంకర దృశ్యం వూహించలేను. కాని... ఆ దృశ్యం నా కళ్ళముందు నుండి తొలగడంలేదే! రక్తసిక్తమైన నీ దేహం... అయ్యో, హలీమా! దుర్మార్గులు నిన్ను చంపి వేశారు, హలీమా! ఏ పాపమూ ఎరుగని నిన్ను పొట్టన పెట్టుకున్నారు. అయ్యో! నీ కోసం రాజవైభవాలు తృణీకరించానే! నీవే సర్వస్వమూ అని భావించానే! అట్టి నీవు నాకు లేకుండా చేశారు కిరాతకులు. నీవు లేకుండా ఎలా జీవించను? నీవు లేని నాకు ఈ వ్యర్థ జీవిత మెందుకు? నా బహిఃప్రాణమైన నీవే దూరమయ్యాక నా కీ లోకంలో ఇంక పనేమున్నది! నేను కూడా నీతో వచ్చేస్తాను. నీవు లేకుండా నేను బతకలేను..." దుఃఖాతిశయంతో అతని కంఠం పూడుకుపోయింది.


అతని దుఃఖం చూసి షాజహాన్ విచలితుడై పోయాడు. అతని కళ్ళు కూడా అశ్రుపూరితాలయాయి. నెమ్మదిగా నడచి ఖుస్రూ దగ్గరగా వెళ్ళి, అతని భుజం మీద లాలనగా చెయ్యి వేశాడు.

ఖుస్రూ దుఃఖాన్ని దిగమింగుకుంటూ షాజహాన్ వైపు తల ఎత్తి చూశాడు. అదే సమయంలో షాజహాన్ కళ్ళలో నిండిన నీరు అతని రెండు చెంపల మీదుగా జారి జీబురుగడ్డంలో కలిసిపోయింది.

ఖుస్రూ వేదాంతిలా నవ్వి "ఇప్పుడు విచారిస్తున్నావా, షాజహాన్! ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నావా? వద్దు. విచారించకు. నేను ఆనాడే మరణించనందుకు సంతోషించు. ఎందుకంటే నేనే మరణించి ఉంటే ఈ దివ్య హర్మ్యం, ఈ స్మృతి చిహ్నం ఎలా వెలసేది? నీ ముంతాజు కోరిక ఎలా ఫలించేది? తమ్ముడూ! నే నింతకాలమూ ఎక్కడ ఉన్నాను? ఎలా బతికాను? ఏం చేశాను? అని అడగవేం? ఇంత గొప్ప కళాకారుడి నెలా అయ్యానో తెలుసా? చెప్తాను విను మరి! రక్తసిక్తమైన నా హలీమా శరీరం మీద పడి విలపించి, సొమ్మసిల్లి పడిపోయాను. అలా ఎంతసేపు గడిచిందో నాకే తెలియదు. బాహ్యస్మృతి కోల్పోయిన నా కళ్ళముందు ఏదో కల—మధురాతి మధురమైన సుందర దృశ్యం. ఆ కలలో...


నేనేదో దివ్యలోకంలో విహరిస్తున్నాను. ఆకలి దప్పులూ, ఈతిబాధలూ, జరామరణాలూ లేని అమరలోక మది. మలయ పవనాలు మంద మందంగా వీస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆ దివ్య లోకంలో—అదొక పూదోట. చిత్ర విచిత్ర లతా నికుంజములతో, సుగంధ భరిత పుష్పాలతో, శ్రవణానందకరమైన పక్షి కూజితాలతో మధుర మనోజ్ఞంగా ఉందా నందన వనం. ఆ ఉద్యానవనం నడుమ— ఆహా— ఆహాహా! ఎంత సుందర హర్మ్యమది! ఎక్కడా, ఎప్పుడూ, ఎవ్వరూ కనీ వినీ ఎరుగని సుందర సౌధ రాజం—ఆహా! ఎవరిదా మణిమందిరము? ఏ మహా శిల్ప వైభవము!

అంతలో ఆ మందిర ద్వారం తెరుచుకుంది. ఆ మందిరాంతర్భాగం నుంచి ఎవరో దివ్య సుందరి చిరునవ్వులు ఒలికిస్తూ, కరుణా వీక్షణాలు ప్రసరిస్తూ, మృదు మధురంగా రాగ మాలపిస్తూ నా వైపే— నా కొరకే చేతులు చాపి వస్తున్నది. ఎవరు? ఎవరది? దివి నుంచి దిగి వస్తున్న దేవతా? దేవ



గాంధారిరాగం ఆలాపిస్తున్న కిన్నెరకాంతా? వెండి మబ్బుల జలతారు అంచులనుండి తళుక్కుమని మెరిసిపోయే శంపాలతా? ఎవరు? ఎవరా సౌందర్య రాశి? షాజహాన్! ఆమె ఎవరనుకున్నావు? ఇంకెవరు? నా హలీమాయే!

ప్రేమకు బానిసనై, సకల రాజభోగాలనూ తృణీకరించిన నన్ను వరించి నాతోబాటు కటిక నేలపై పడుకుంది హలీమా. నా హృదయ పీఠాన్నే కుసుమ తల్పంగా భావించి మర సుఖాల నందించింది. అట్టి ప్రణయ స్వరూపిణికి—అమృత మూర్తికి— నే నెట్టి సౌకర్యమూ కలిగించలేక పోయాను. కాని, అల్లా దయామయుడు కదా! సుందర హర్మ్యాల్లో నివసించదగిన ఆమె నాతో పూరి గుడిసెలో ఉండటం సహించలేక పోయాడు. హంసతూలికా తల్పాలపై శయనించదగిన ఆమె నాతో కలిసి కటిక నేలపై పడుకోవడం సహించలేక పోయాడు. తన చెంతకు చేర్చుకుని ఆమెను ఆ రమ్య హర్మ్యంలో పదిలపరిచాడు. అవును. అదే ఆమెకు అనువైన చోటు. అల్లా నా కనులు తెరిపించాడు.




స్వప్న రూపంలో నాకు కర్తవ్యం ప్రబోధించాడు. ఆ స్వప్న సీమలో సాక్షాత్కరించిన ఆ సుందర మందిరాన్ని—ఇదిగో—భూమండలంలో ఇదొక వింతగా ఈ మహల్ నిర్మించాను. ఇది మా పవిత్ర ప్రణయానికి చిహ్నం. ఇది నా హలీమాకు ప్రేమ నైవేద్యంగా నేను సమర్పించుకున్న అపూర్వ కానుక. షాజహాన్! అతులితమైన ఈ అందాల మహలును—నా కలలో సాక్షాత్కరించిన ఆ కమనీయ శిల్ప కళా వైభవాన్ని—ఈ భువన మండలంలో అవతరింపజేయడానికి ఎంత పాటుపడ్డా ననుకున్నావు, షాజహాన్! వేషం మార్చాను. దేశ దేశాలూ తిరిగాను. నా జీవిత కాలాన్ని వెచ్చించి ప్రపంచంలోని శిల్ప విద్యా రహస్యాలన్నీ కరతలామలకం చేసుకున్నాను. తప్పక ఇది అల్లా ఆశీర్వాదమే! కాకపోతే నా సుందర స్వప్నాన్ని ఇలా సజీవ శిల్పంగా సృజించడానికి నే నెంత వాడిని! నా కింత ధన మెక్కడిది? మందిర కుడ్యాల్లో, ద్వార బంధాల్లో పొదగడానికి వజ్ర వైడూర్యా లెక్కడివి? అంతా అల్లా దయ, షాజహాన్! నువ్వు ఎంత నిర్దయగా నా హలీమాను బలిగొన్నావో, నీ ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన నీ భార్య ముంతాజును కూడా అలాగే తీసుకుని వెళ్ళాడురా నా మొర విన్న దేవుడు! నీ భార్య ముంతాజు నోట నా కోరికను పలికించాడు. ఆమె మరణించబోతూ తన సమాధిపై అపూర్వ సౌధాన్ని నిర్మించమని నిన్ను కోరిన కోరిక నా కల ఫలించడానికి నాంది అయింది. ఆమె మీది వ్యామోహంతో ఆమె సమాధిపై అపూర్వ సౌధాన్ని నిర్మించ సంకల్పించావు నువ్వు. అద్భుత శిల్పిగా అఖండ ఖ్యాతి నార్జించిన నన్ను ఈ తాజమహల్ నిర్మాణానికి నియమించావు. నా ప్రయత్నం లేకుండానే నా కల నిజమైంది—చూశావా! నా హలీమాను భూస్థాపితం చేసిన ఈ పవిత్ర స్థలంలోనే నా స్వప్న లోకంలో ప్రత్యక్షమైన ఆ దివ్య భవనాన్ని నీ సహకారంతో నిర్మించాను. ఇది తాజమహలే అనుకుని నీ అంతులేని ధనాన్ని వెచ్చించావు. ఇది నీ ముంతాజు సమాధి అనుకుంటున్నావా, షాజహాన్? కాదురా? ఇది నా హలీమా సమాధి. ఇది తాజమహల్ కాదు. హలీమా మహల్. అర్థమయిందా. షాజహాన్! ఇది తాజమహలో లేక హలీమా మహలో ఇప్పటికైనా తెలుసుకున్నావా?'' అంటూ విజయ గర్వంతో షాజహాన్ ముఖంలోకి చూశాడు ఖుస్రూ.

అంతా విని షాజహాన్ నవనాడులూ కుంగిపోయాయి. అతని పరిస్థితి ఎంతో దైన్యంగా ఉంది ఇప్పుడు. ఎంతో శ్రద్ధాసక్తులతో తాజమహల్ నిర్మాణానికి అంతులేని ధనాన్నీ, అవిరళ కృషినీ వెచ్చించిన షాజహాన్ తన కృషి, సంపదా అంతా బూడిదలో పోసిన పన్నీరు అయినట్లు ఆవేదనతోనూ, అవమానంతోనూ కుమిలిపోయాడు. కళ్ళ నుండి కన్నీరు ధారాపాతంగా స్రవించసాగింది. అతని పెదవులూ, ముక్కూ, శరీరమూ దుఃఖ భారాన్ని భరించ శక్యంగాక వణికిపోసాగాయి. ఉన్నట్టుండి ఖుస్రూను కావిలించుకుని—''అన్నా! అన్నా!'' అంటూ అతని భుజంమీద తల వాల్చి శోకిస్తూ—''నీ కెంత ద్రోహం చేశానన్నా! ఎంత ఘాతుకం చేశాను! నా పాపాలకు నిష్కృతి లేదు. ఇదుగో—ఈ కరవాలం చూడు. నీ మీద కోపంతో, నిన్ను చంపాలని చూశాను. కాని, నేను చేసింది ఎంత క్రూర కార్యమో నా కిప్పు డర్థమయింది. ఈ ఖడ్గంతో ఒక్క వేటుతో నా కంఠాన్ని తెగవెయ్యి. అన్నా! నన్ను వధించే ముందు నా కొక్క వరమియ్యి'' అంటూ ఖుస్రూ పాదాలమీద వాలిపోయాడు షాజహాన్.

ఖుస్రూ అతని భుజాలు పట్టుకుని లేవనెత్తుతూ, ''షాజహాన్! ఏమిటిది? లే—జరిగిందేదో జరిగిపోయింది. దాని గురించి ఇప్పు డెంత విచారించి లాభమేముంది? నీ కోరి కేమిటో చెప్పు. నా హలీమా మహల్ నిర్మాణానికి మూల కారకుడివైన నీ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను. చెప్పు. అందుకు కృతజ్ఞతగా నీకేం వరం కావాలో కోరుకో—ఇచ్చేస్తాను. షాజహాన్! యావద్భారత దేశానికి చక్రవర్తివి నువ్వు. నువ్వు నన్ను వరం కోరడ మేమిటి? ఆజ్ఞాపించు. నీకేం కావాలో సెలవియ్యి. అవశ్యం నెరవేరుస్తాను'' అన్నాడు.

షాజహాన్ లజ్జావమానాలతో అవనత వదనుడై—''అన్నా! చచ్చిన పామును ఇంకా చంపకు. నిజంగా నీ కరుణా వీక్షణాలు నాపై ప్రసరించకుంటే నా శ్రమ అంతా వృథా అవుతుంది. నా ముంతాజుకు నే నిచ్చిన మాట నిలబెట్టుకోలేను. అంతా నీ దయాభిక్ష మీద ఆధారపడి ఉంది...'' అన్నాడు.

''షాజహాన్! ఏమిటి నువ్వంటున్నది? నీ ఆంతర్యం నా కర్థం కావడం లేదు'' అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు ఖుస్రూ.

''అవునన్నా! ముంతాజు మరణించబోతూ నన్ను రెండు కోరికలు కోరింది. మొదటిది—నన్ను మళ్ళీ పునర్వివాహం చేసుకోవద్దని... రెండవది—తన జ్ఞాపకార్థం ఆమె సమాధిపై అపూర్వ మందిరం నిర్మించమని. ఆమె మొదటి కోరిక తీర్చాను. నిజం! ఆమె మరణించిన తర్వాత మధు పాత్ర ముట్టలేదు. మరే స్త్రీ వైపు కన్నెత్తయినా చూడలేదు. ఇక ఆమె రెండవ కోరిక ఈ తాజమహల్ నిర్మాణంతో అదీ తీర్చాననుకున్నాను. కాని ఇది తాజమహల్ కాదనీ, నేను పూర్తిగా మోసపోయాననీ ఇప్పుడే తెలిసింది. ఇప్పు డేం చేయను? ఇక నాకు ఏది దారి? అందుకే నిన్ను వేడుకుంటున్నాను. దీనాతి దీనుడనై ప్రార్థిస్తున్నాను. అన్నా! ఈ హలీమా మహల్ ప్రక్కనే నా కొక తాజమహల్ సృష్టించి ఇయ్యి. అయితే అది హలీమా మహల్ కంటె మరింత అద్భుతంగా ఉండాలి. నా భార్యకు నే నిచ్చిన మాటను నిలబెట్టు. ఆమె ఆత్మకు శాంతి ప్రసాదించు. నన్ను కృతార్థుణ్ణి చెయ్యి'' అంటూ ఖుస్రూ రెండు చేతులనూ పట్టుకున్నాడు షాజహాన్.

ఖుస్రూ చాలా సేపు ఆలోచనలో పడ్డాడు. ఎటో చూస్తూ ఉండిపోయాడు. చాలా సేపు నిశ్శబ్దం రాజ్యం చేసిం దక్కడ. అతని ఆలోచనలు పరిపరి విధాలా పోయాయి.

అతని ముఖంలో మారే రంగుల్ని చూస్తూ ఆశగా, ఆత్రతగా, అత డేం సమాధానం చెబుతాడో అని ఆందోళనగా అతని ముఖం లోకి చూస్తూ నిలుచుండి పోయాడు షాజహాన్.

అలా కొంత సేపు గడిచాక ఖుస్రూ కళ్ళలో ఏదో నిశ్చయభావం ద్యోతకమైంది. ముఖం గంభీరంగా

మారిపోయింది. ఏదో స్థిర నిర్ణయానికి వచ్చిన వాడిలా దీర్ఘ నిశ్వాసం విడిచాడు.

షాజహాన్ ఆశగా ఖుస్రూ చేతుల్ని మరింత గట్టిగా పట్టుకుని—"అన్నా!" అంటూ అతని కళ్ళలోకి చూశాడు.

ఖుస్రూ జాలిగా, బేలగా అతని ముఖం లోకి చూస్తూ "ఖుర్రం! అసంభవం నాయనా!" అన్నాడు.

షాజహాన్ ఆ సమాధానంతో నిర్విణ్ణుడై పోయాడు. ఆపుకోలేని దుఃఖంతో వివశుడై పోతూ "అంతేనా? అదే నీ నిర్ణయమా? నీ నిర్ణయం మారదా? తాజమహల్ వెలయడానికి అవకాశమే లేదా? నా భార్య కిచ్చిన మాట తప్పవలసిందేనా? ఆమె ఆత్మకు శాంతీ, తృప్తీ కలిగించవేలేనా?" అంటూ వాపోయాడు.

అతని దుఃఖం చూసి ఖుస్రూ హృదయం పరితపించింది. ధైర్యం వహించమన్నట్టు అతని భుజం తట్టి, దుఃఖం మానమన్నట్టు అతని కన్నీరు తుడిచి అన్నాడు ఖుస్రూ: "అధైర్య పడకు, ఖుర్రం! నువ్వు కోరిన వరం నీకు ప్రసాదిస్తున్నాను."

షాజహాన్ ముఖంలో వెయ్యి జ్యోతులు వెలిగాయి. "అన్నా!" అంటూ ఆనందోద్వేగాలతో ఖుస్రూను కౌగిలించుకున్నాడు. అతని చేతుల్ని పదే పదే ముద్దు పెట్టుకున్నాడు.

"కాని, షాజహాన్!" ఖుస్రూ ఏదో చెప్పబోతూ ఆగాడు.

షాజహాన్ ప్రశ్నార్థకంగా చూశాడు.

ఖుస్రూ అన్నాడు: "ఈ హాలీమా మహల్ కంటే అందమైన తాజమహల్‌ను నేను సృష్టించలేను. అది అసంభవం."

షాజహాన్ మళ్ళీ దీనవదను డయ్యాడు. "అన్నా! నువ్వు తలుచుకుంటే ఇంతకంటె పరమాద్భుతంగా నిర్మించగలవు. ధనం గురించి ఆలోచించకు. నా సర్వస్వమూ ధార పోస్తాను. ఎలాగైనా సరే, హాలీమా మహల్‌ను మించిన అందాల్ని ప్రోగు చేసి తాజమహల్‌ను నిర్మించాలి నువ్వు. అన్నా! చక్రవర్తిగా ఇది నా ఆజ్ఞ అనుకో—లేదా, ఒక దీనుడి అభ్యర్థన అనుకో—మరేమైనా అనుకో! నువ్వు నా కోరికను మన్నించి తీరవలసిందే" అన్నాడు.

నిర్లక్ష్యంగా నవ్వాడు ఖుస్రూ. "వీల్లేదు. హాలీమా మహల్‌ను మించిన అందాల మహలు ఈ భూతలంపై ఉండడానికి వీల్లేదు. ఈ మహల్ లాంటి మరో మహలును నిర్మించి నా హాలీమాకు నేను ద్రోహం చేయలేను."

"నేను కోరిన వరం ప్రసాదిస్తానన్నావు?" అన్నాడు షాజహాన్.

"మాట తప్పను" అన్నాడు ఖుస్రూ అతని చేతిలో చెయ్యి వేస్తూ.

విస్మయంగా చూశాడు షాజహాన్.

ఖుస్రూ చిరునవ్వుతో అన్నాడు: "అర్థం కాలేదా, షాజహాన్! ఏమైతేనేం? నా కల ఫలించింది. ఇక నీ కోరికా తీరాలి కదూ! తప్పక తీరుతుంది. నిజాని కిది హాలీమా మహలే అయినా, తాజమహలుగానే చరిత్రలో నిలిచి పోతుందిలే, షాజహాన్! ఈ భవన నిర్మాణానికి నీ అపార సంపదను వెచ్చించిన నీకు కృతజ్ఞతాగా




ఇది హాలీమామహల్ అన్న సత్యాన్ని లోకానికి వెల్లడించ నులే. ఇలా నీ కోరిక తీరుస్తాను. అంతే కాని, నేను మరొక మహలును నిర్మించ లేను. అదీకాక ఇప్పటికే ఎంతో ధనం వ్యయమై పోయింది. ఇప్పుడు మళ్ళీ మరొక మహలు నిర్మాణమంటే మాటలతో పని కాదు. మళ్ళీ అంత ధనం ఖర్చు చేస్తానంటే దేశంలో ఎంతో అరాచకం లేవగలదు. లేనిపోని అనర్థం కొని తెచ్చుకోవడ మెందుకు? షాజహాన్! లోకాని కీ విషయాలు తెలియ వలసిన అవసరం లేదు. ఎవరికీ తెలియకపోయినా ఇది హాలీమా మహలే! చరిత్రలో ఇది తాజమహలుగా మిగిలిపోతున్నా, మునమ్మాటికీ ఇది హాలీమా మహలే. నా కీ తృప్తి చాలు. నీ మనసు కుదుటపడిందా, షాజహాన్?"

షాజహాన్ తృప్తిగా నిట్టూర్పు విడిచాడు. "చాలు. నా కీ వరం చాలు. నేను ధన్యుణ్ణి, అన్నా! నువ్వు మానవ రూపంలో వెలసిన దైవానివి. నేను నీకు తమ్ముణ్ణిగా పుట్టడం నా పూర్వ జన్మ సుకృతం. కాని, నిన్ను 'అన్నా' అని పిలిచే అర్హత కోల్పోయిన దౌర్భాగ్యుడివి, అన్నా! నన్ను మన్నించానంటే మరొక్క వరం కోరతాను. ఆశీర్వదించు" అన్నాడు.

"తమ్ముడూ, ఖుర్రం! ఎన్ని వరాలు ఇచ్చినా, నీ ఋణం తీర్చుకోలేను నాయనా! కోరుకో నీ కేవలం కావాలో, ఎన్ని వరాలు కావాలో కోరుకో'' అన్నాడు ఖుస్రూ.

"అన్నా! ఇక మిగిలింది ఒకే ఒక్క కోరిక. నువ్వు అభ్యంతరం చెప్పక నా వెంట రాజ ప్రాసాదానికి రావాలి. తెల్లవారగానే ఢిల్లీ నగర మంతటా చాటింపు వేయిస్తాను. ఆనందోత్సాహాలతో నిన్ను నెమలి సింహాసనంపై ఆసీనుణ్ణి చేస్తాను. భారత సామ్రాజ్యానికి నువ్వే చక్రవర్తివని ప్రకటిస్తాను. నేను శ్రీరామచంద్రుడికి లక్ష్మణుడి వలె నీ సేవలు చేసుకుంటూ శేష జీవితాన్ని గడుపుతాను'' అన్నాడు షాజహాన్ నిండు హృదయంతో.

ఖుస్రూ విరాగిలా నవ్వి—"ఖుర్రం! గతం నాస్తి. లోకం దృష్టిలో నే నెప్పుడో మరణించాను. ఇప్పుడు మళ్ళీ నన్ను తీసుకెళ్ళి రాజ్యాభిషేకం చేసి లేనిపోని అనర్థాన్ని సృష్టించకు. నాకు రాజ్యం మీద ఆశే ఉండి ఉంటే ఆ నాడు నీ కుట్రలు సాగి ఉండేవా? నువ్వు చక్రవర్తివి కాగలిగి ఉండేవాడివా? వెర్రి ఆలోచనలు మాని నిశ్చింతగా వెళ్ళిపో. కాని, ఒక్క విషయం. నీ అన్న — ఈ ఖుస్రూ బ్రతికి ఉన్నాడనే సంగతి ఎవ్వరికీ చెప్పకు. చెప్పినందువల్ల ప్రయోజనం లేకపోగా, అది నీకే ప్రమాదంగా పరిణమించగలదు. అంతేగాక ఇది తాజమహలుగా చరిత్రలో నిలిచి పోవడానికి కూడా అవరోధం ఏర్పడగలదు. జాగ్రత్త. మరి వెళ్ళిరా'' అన్నాడు.

షాజహాన్ రెండు చేతులతో తల బాదుకుంటూ "అల్లా, అల్లా! ఎంతటి విషమ పరిస్థితి కల్పించావయ్యా!'' అంటూ కూలబడ్డాడు నేలపై.

ఖుస్రూ అతణ్ణి లేవనెత్తుతూ — "షాజహాన్! నిర్విచారంగా వెళ్ళి పొమ్మని చెప్పానుగదా! దీపాలు వెలిగించే వేళ అయింది. పరిచారికలు వస్తుంటారు. వాళ్ళెవరైనా చూస్తే బాగుండదు. వెళ్ళిపో. తక్షణం వెళ్ళిపో ఇక్కడినుంచి'' అంటూ వేగిరపెట్టాడు.

షాజహాన్ నుదురు కొట్టుకుంటూ "అంతే. అంతే. అంతకంటే ఇంకేమీ చేయలేని దౌర్భాగ్యుణ్ణి, వ్యర్థజీవిని'' అని తనను తాను తిట్టుకుంటూ విసవిసా నడిచి బయటికి వెళ్ళిపోయాడు.

షాజహాన్ వెళ్ళిన వైపే చూస్తూ నిలుచుండిపోయాడు ఖుస్రూ. షాజహాన్ కనుమరుగు కాగానే విజయగర్వంతో మీసం మెలివేసి వికటాట్టహాసం చేశాడు ఖుస్రూ. అతడి నవ్వుతో ఆ భవనమంతా ప్రతిధ్వనించిపోయింది.

అల్లంత దూరం వెళ్ళిన షాజహాన్ చెవులకుకూడా సోకింది ఆ నవ్వు. చటుక్కున ఆగిపోయి వెనుదిరిగి చూశాడు. ప్రళయ కాల పర్జన్య గర్జనంలా ఉన్న ఆ నవ్వు ఎంతకూ ఆగలేదు. ఖుస్రూ అంతగా ఎందుకు నవ్వుతున్నాడో షాజహాన్‌కు అంతుపట్టలేదు. అతని కంతా అయోమయంగా ఉంది. గబగబా వెనుకకు పరుగెత్తుకుంటూ వచ్చి లోనికి అడుగు పెట్ట బోయాడు. అంతే! ఆ నవ్వు రక్కున ఆగిపోయింది. ఆ నవ్వుతోబాటే లోనికి ప్రవేశించబోయిన షాజహాన్ అడుగులు కూడా ఆగిపోయాయి. "హలీమా!'' అని ఖుస్రూ గట్టిగా అరవడం వినిపించింది షాజహాన్ చెవులకు. లోనికి వెళ్ళబోయిన షాజహాన్ ఆ ప్రయత్నం మాని, అత డేం మాట్లాడబోతున్నాడో విందామని గోడ చాటుగా నక్కి నిలుచున్నాడు. ఖుస్రూ మాటలు అతనికి స్పష్టంగా వినిపించసాగాయి.



"హలీమా! నా జీవిత ధ్యేయం ముగిసింది. నా లక్ష్యాన్ని సాధించాను. ఇక ఈ లోకంలో నాకేం పని లేదు. వచ్చేస్తున్నాను. నీ దగ్గరకు వచ్చేస్తున్నాను. కుటిల రాజకీయాలకు దూరంగా, కుళ్ళు సమాజపు నీడ పడని పుణ్య లోకాలకు వెళ్ళిపోదాం. మనల్ని ఎవరూ విడదీయలేని పవిత్ర లోకంలో స్వేచ్ఛా విహంగాలమై, చిరంజీవులమై అంతులేని ఆనందాన్ని అనుభవిస్తూ హాయిగా, తీయగా విహరిద్దాం. ఇదిగో — ఈ పచ్చల పిడి బాకు నా కొరకు స్వర్గ ద్వారాలు తెరుస్తోంది. దేవతలు నా కొరకు పూల రథం సిద్ధపరుస్తున్నారు. వచ్చేస్తున్నాను. హలీమా! వచ్చేస్తున్నాను!''

మాటలు ఆగిపోయి వెంటనే ఒక వికటాట్టహాసం, ఆ వెనువెంటనే "అబ్బా!'' అనే గావుకేక ఒకదాని వెంట ఒకటి వినవచ్చాయి షాజహాన్‌కు. జరిగిందేమిటో పూహించుకున్న షాజహాన్ పరుగు పరుగున లోపలికి వెళ్ళాడు. నెత్తురు మడుగులో పొర్లుతూ మృత్యువు నాహ్వానిస్తున్న ఖుస్రూ అతని కంటబడ్డాడు.

"అన్నా! అన్నా! ఏమిటిది? ఎందు కింత పని చేశావు?'' అంటూ ఒక్క ఉదుటున ఖుస్రూ శరీరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు షాజహాన్. ఖుస్రూ గుండెలో పిడిబాకు! షాజహాన్ కళ్ళు భైర్లుకమ్మాయి.

ఖుస్రూ నోటి వెంట అస్పష్టంగా మాటలు వస్తున్నాయి. "ఒరేయ్ ... షాజహాన్ ...! వెళ్ళిపోతున్నాను. ఇది హలీమా మహల్ అన్న విషయం లోకానికి వెల్లడి కాకూడదని ఈ రహస్యాన్ని.. నాతోనే తీసుకు వెళ్ళిపోతున్నాను... ఒరేయ్! ఈ తాజమహల్ నీది కాదురా! ఇది తాజమహలే కాదురా!

నా ప్రియతమమైన ప్రణయదేవి హలీమాకు ... ఈ ప్రేమ పూజారి ... సగర్వంగా సమర్పించుకుంటున్న ... కర్పూర నీరాజనం ... హలీమా మహల్! హలీమా ... మహల్! ... హ...లీ...మా... మ...హ...ల్...

అంతే! ఖుస్రూ తల వాలిపోయింది. షాజహాన్‌కు బాహ్య స్మృతి లేకుండా పోయింది. *